క్లుప్తంగా

వైభవంగా శ్రీవారి కల్యాణ మహోత్సవం



కల్యాణ మహోత్సవంలో పాల్గొన్న అర్చకులు, అధికారులు, భక్తులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక రామచంద్ర రావు పేట శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీవారి 36వ మహా కుంభాభిషేకాల్లో భాగంగా శనివారం స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం శ్రీ విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం, చతుస్థానార్చన, మూలమంత్ర హవనాలు, శ్రీ సుదర్శన నారసింహ హవనం, నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి శాత్తుమురై నిర్వహించి తీర్థ ప్రసాద గోష్టి నిర్వహించారు. సాయంత్రం శ్రీ విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం, చతుస్థానార్చన, మూల మంత్ర హవనాలు నిర్వహించారు. రాత్రి 7 గంటలకు శ్రీ వారి కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించి నీరాజన మంత్రపుష్పాలు, శాత్తుమురై సమర్పించి తీర్థ ప్రసాద గోష్టి చేశారు. ఆలయ ముఖ్య అర్చకుడు కిళాంబి మారుతీ శ్రీనివాస రామానుజాచార్యులు పర్యవేక్షణలో యాజ్ఞిక బ్రహ్మలు జీఏవీ దీక్షిత్ స్వామి, కిళాంబి వేంకట పవన్ కృష్ణమాచార్యులు పూజలు చేయగా, ఆలయ కార్యనిర్వహణాధికారి సతీష్ కుమార్ నల్లూరి కార్యక్రమాలను పర్యవేక్షించారు.

మండలానికి 54,261 పాఠ్య పుస్తకాలు



పరిశీలిస్తున్న ఎంఈఓ దేవినేని వెంకటరమణ

దెందులూరు: ఏలూరు రూరల్ మండలానికి 54,261 పాఠ్య పుస్తకాలు వచ్చాయని ఎంఈఓ దేవినేని వెంకటరమణ అన్నారు. శనివారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ ఏడు, తొమ్మిది తరగతులకు ఇంకా పాఠ్య పుస్తకాలు పూర్తిస్థాయిలో మంజూరు కాలేదన్నారు.

ఎంఆర్‌పీఎస్ ఆర్థిక సాయం

దెందులూరు: అక్కిరెడ్డిగూడెం గ్రామంలో ఇటీవల మృతి చెందిన ఎల్లమెల్లి ప్రసాద్ కుటుంబ సభ్యులను ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తనగల శేఖర్ పరామర్శించారు. ప్రసాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రసాద్ కుటుంబ సభ్యులకు నిత్యావసర వస్తువులు, నగదును అందజేశారు. మృతుల కుటుంబాలకి ఎంఆర్‌పీఎస్ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. పెద్దలు తనగల వెంకటేశ్వరరావు, సంఘ సోమయ్య, ముల్లంగి ముత్తయ్య, కొండపల్లి శేఖర్ పాల్గొన్నారు.

ఇండోర్ స్టేడియం అభివృద్ధిపై నిర్లక్ష్యం

- పట్టించుకోని అధికారులు
- వాకర్లు, క్రీడాకారుల ఆవేదన



కూలిపోయిన ఇండోర్ స్టేడియం



ఇండోర్ స్టేడియంలో నిలిచిన హ్యాండ్‌బాల్ కోర్టు పనులు



అభివృద్ధికి నోచుకోని స్కేటింగ్ రింగ్

ఏలూరు రూరల్ : వైఎస్సార్ సీపీ హయాంలో చురుగ్గా సాగిన ఏలూరు ఇండోర్ స్టేడియం అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. ఈ పనులు ఎప్పుడు పూర్తి చేస్తారోనని క్రీడాకారులు ఆశగా ఎదురుచూస్తున్నారు. దీనికితోడు కూలిపోయిన ఇండోర్ స్టేడియం మొండిగోడలు క్రీడాభిమానులను వెక్కిరిస్తోంది. వైఎస్సార్ సీపీ హయాంలో ఏడాదిన్నర క్రితం జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారులు సుమారు రూ.58 లక్షలతో పనులు చేపట్టిన విషయం విదితమే. ఇందులో వెయిట్ లిఫ్టింగ్ హాలు శ్లాబు మరమ్మతులు చేపట్టి పూర్తి చేశారు. హ్యాండ్‌బాల్ కోర్టు నిర్మాణం చేపట్టారు. చుట్టూ ప్రహరీ నిర్మించి కంచె సైతం ఏర్పాటు చేశారు. సరిగ్గా పిల్లలు సాధన చేసేందుకు కోర్టు గ్రౌండ్ పనులు నిలిపేశారు. స్కేటింగ్ రింగ్ అభివృద్ధి, ఫ్లడ్ లైట్ల ఏర్పాటు తదితర పనులు ప్రారంభించనే లేదు. మొదట పనులు చురుగ్గా సాగినప్పటికీ, కూటమి ప్రభుత్వం ఏర్పడగానే పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి.

కాంట్రాక్టర్‌తో సంప్రదిస్తున్నాం



జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ నిధులతో కార్పొరేషన్ ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణలో అభివృద్ధి పనులు చేపట్టాం. మొదట కాంట్రాక్టర్ చురుగ్గా పనులు చేశారు. తర్వాత పనులు నిలిపేశారు. దీనిపై పలుసార్లు, నగర కమిషనర్, కాంట్రాక్టర్‌తో మాట్లాడాను. ఇప్పటి వరకు పూర్తి చేసిన పనులకు సైతం బిల్లులు చెల్లించలేదు. పనులు పూర్తి చేస్తే బిల్లులు చెల్లిస్తామని చెప్పినా కాంట్రాక్టర్ స్పందించడం లేదు. కూలిన ఇండోర్ స్థానంలో కొత్తది నిర్మించేందుకు కలెక్టర్ వెట్రిసెల్వి కృషితో కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.14 కోట్లు మంజూరయ్యేందుకు ప్రయత్నిస్తున్నాం. జిల్లా గృహ నిర్మాణశాఖ అధికారులు డీపీఆర్ తయారుచేశారు. ఇంజినీర్లు స్థలం పరిశీలించి, కొలతలు తీసుకున్నారు.

– బి.శ్రీనివాస్, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి

పనులు పూర్తి చేయాలి



స్టేడియం పైకప్పు కూలి నెలలు గడుస్తున్నాయి. ఇప్పటివరకు ప్రభుత్వం పునర్నించకపోవడం విచారకరం. పిల్లలు ఆటలకు అవకాశం లేకుండా పోయింది. ప్రభుత్వం ఆటలకు ప్రాధాన్యత ఇస్తామంటుంది కాని, పనులు కనిపించడం లేదు. నేనే ప్రతిరోజూ వాకింగ్ చేసేసిన తర్వాత ఇందులో ఉన్న జిమ్‌లో కొద్దిసేపు సాధన చేసేవాడిని. జిమ్ కూడా మూసివేశారు.

– సుభాని, వాకర్

సంక్షిప్తం

126 మందికి ఉచిత వైద్య పరీక్షలు

ఏలూరు (టూటౌన్): స్థానిక ఆర్‌ఆర్‌పేటలోని శ్రీ కృష్ణ ఆస్పత్రిలో శనివారం ఏర్పాటుచేసిన ఉచిత వైద్య శిబిరంలో 126 మందికి వైద్య పరీక్షలు చేశారు. అవసరమైనవారికి మందులను ఉచితంగా అందజేశారు. శిబిరంలో డాక్టర్లు రవికిరణ్, దిలీప్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్య శిబిరం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక రామకోటి ప్రాంగణంలో శనివారం నిర్వహించిన ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరంలో 102 మంది వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన మందులు పంపిణీ చేశారు. డాక్టర్ నగేష్ పాల్గొన్నారు.

మురళీ నాయక్ మృతికి సంతాపం

ఏలూరు (టూటౌన్): దేశం కోసం తన ప్రాణాన్ని తృణప్రాయంగా అర్పించిన ధీరుడు మురళీనాయక్ అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డేగా ప్రభాకర్, ఏలూరు ఏరియా కార్యదర్శి ఉప్పులూరి హేమ శంకర్ శుక్రవారం ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. భారత నియంత్రణ రేఖ వద్ద జరిగిన యుద్ధభూమిలె మురళీ నాయక్ అసాధారణ ధైర్య సాహసాలు ప్రదర్శించారని కొనియాడారు. మురళీనాయక్ చేసిన త్యాగం దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు.

గర్భిణులకు ఉచిత వైద్య సేవలు

- యూపీహెచ్‌సీల్లో ప్రతినెలా 9, 10 తేదీల్లో ప్రత్యేకంగా సేవలు
- పరీక్షలు, మందులు ఉచితం



మోతేవారితోట యూపీహెచ్‌సీలో గర్భిణికి వైద్య పరీక్ష చేస్తున్న డాక్టర్ మానస

ఏలూరు టౌన్ : మహిళలు గర్భం దాల్చిన సమయంలో అనేక అనారోగ్య సమస్యలు ఉత్పన్నం అవుతుంటాయి. వీటిని వైద్యుల పర్యవేక్షణలో పరీక్షించుకుని, వారి సూచనలు, సలహాలతో పరిష్కరించుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ఏలూరు నగరంలో సుమారు 9కి పైగా పట్టణ ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. వీటిని వైఎస్సార్ సీపీ హయాంలో ఆధునికీకరించడంతోపాటు, కొత్త యూపీహెచ్‌సీ భవనాలను నిర్మించారు. యూపీహెచ్‌సీల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు వైద్యులు అందుబాటులో ఉంటారు.

గర్భిణుల ఆరోగ్యంపై శ్రద్ధ

ప్రధాన మంత్రి సురక్ష మాతృత్వ పథకంలో భాగంగా ఆయా యూపీహెచ్‌సీలకు వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోవచ్చు. అనారోగ్య సమస్యలను పరిష్కరించుకోవచ్చు. ఈ కేంద్రాల్లో ప్రతి నెలా 9, 10 తేదీల్లో గర్భిణులకు వైద్యులు ఉచితంగా పరీక్షలు చేయటంతోపాటు, మందులు సైతం అందిస్తారు. గర్భంలో శిశువు బరువు పెరగకపోయినా, గర్భిణులు రక్తహీనత సమస్యతో బాధపడుతున్నా వైద్య పరీక్షలు చేసి, మందులు ఇచ్చి సూచనలు, సలహాలు అందిస్తారు. ఏలూరు నగరంలోని మోతేవారితోట, లంబాడీపేట, పవర్‌పేట, డీఎంహెచ్‌ఓ కార్యాలయం ప్రాంతం, అశోక్‌నగర్, శ్రీరామ్‌నగర్, వన్‌టౌన్ ఇలా 9 యూపీహెచ్‌సీలను అత్యాధునిక వైద్య పరికరాలు, వసతులతో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నిర్మించింది. వీటిలో టెక్నీషియన్లను కూడా నియమించింది.



పవర్‌పేట యూపీహెచ్‌సీలో గర్భిణులకు సూచనలు చేస్తున్న అసిస్టెంట్ మలేరియా అధికారి గోవిందరావు, డాక్టర్ గౌతమ్

ప్రత్యేక వైద్య శిబిరాలు

ఏలూరు నగరంలోని పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో ప్రతినెలా గర్భిణులకు ప్రత్యేకంగా రెండు, మూడు రోజులు ప్రత్యేక వైద్య సేవలు అందిస్తున్నారు. ప్రతి నెలా చేపట్టే ప్రత్యేక వైద్య శిబిరంలో ఆయా యూపీహెచ్‌సీ ప్రాంతాల్లో 20 మంది వరకు గర్భిణులు వైద్యులతో పరీక్షలు చేయించుకుంటున్నారు. ఇలా ప్రతినెలా రెండు రోజుల్లో 40 మందికి పైగా గర్భిణులు వైద్య సేవలు పొందుతున్నారు. యూపీహెచ్‌సీల్లో సుమారు 250 నుంచి 300 మందికిపైగా గర్భిణులు వైద్య సేవలు పొందుతున్నారని వైద్యులు చెబుతున్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో గర్భిణులు, బాలింతల వద్దకే వైద్యులు వెళ్లి పరీక్షలు చేసి, మందులు ఇచ్చేవారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో ఆ దిశగా చర్యలేమీ చేపట్టలేదని మహిళలు వాపోతున్నారు.

బలమైన ఆహారం తీసుకోవాలి



గర్భిణులు ప్రతినెలా క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలి. పండ్లు, ఆకుకూరలు, కూరగాయలు, కోడిగుడ్లు, పాలు వంటివి తీసుకోవాలి. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే వేరుశనగ ఉండలు, పౌష్టికాహారాన్ని తీసుకోవటం ద్వారా రక్తహీనత సమస్యను అధిగమించవచ్చు. వైద్యుల సూచనలు మేరకు గర్భిణులు సులువైన వ్యాయామాలు చేయడం వల్ల ఆరోగ్యంతోపాటు, సుఖప్రసవానికి అవకాశం ఉంటుంది. ప్రసవాలకు ప్రభుత్వాసుపత్రులకే వెళ్లాలి.

– డాక్టర్ ట్వింకిల్, యూపీహెచ్‌సీ వైద్యాధికారి, లంబాడీపేట, ఏలూరు

కౌలు రైతులకు పెట్టుబడి సాయం అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

ఏలూరు (టూటౌన్): కౌలు రైతులకు గుర్తింపు కార్డులు మంజూరు చేయకుండా అన్నదాత సుఖీభవ పెట్టుబడి సాయం ఏ విధంగా అందిస్తారని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ ప్రశ్నించారు. శనివారం అన్నే భవనంలో అన్నదాత సుఖీభవ పెట్టుబడి సాయం – కౌలు రైతులు అనే అంశంపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెలాఖరు నాటికి రైతులకు అన్నదాత సుఖీభవ పెట్టుబడి సాయం అందిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారని తెలిపారు. వాస్తవ సాగుదారులైన కౌలు రైతులకు పెట్టుబడి సాయం అందించడంపై విధివిధానాలు ప్రకటించకపోవడం అన్యాయమన్నారు. కౌలు రైతులకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామని చెబుతోన్న కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పెట్టుబడి సాయం అందించడంపై వారికి తగిన ప్రాధాన్యత ఇవ్వడం లేదని విమర్శించారు. దేవలయ భూములు సాగు చేస్తున్న కౌలు రైతులకు పెట్టుబడి సాయం అందించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం కౌలు రైతులను గుర్తించడం లేదని, ఫలితంగా ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం అమలు చేయడం లేదని అన్నారు. అన్నదాత సుఖీభవ పెట్టుబడి సాయం భూమిలేని కౌలు రైతులకు, దేవలయ భూములు సాగు చేస్తున్న కౌలు రైతులకు వర్తింపజేసేలా తక్షణమే విధివిధానాల ప్రకటించాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. సమావేశానికి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కట్టా భాస్కరరావు అధ్యక్షత వహించగా, జిల్లా నాయకులు కోన శ్రీనివాసరావు, జి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య విద్యార్థికి తప్పిన ప్రమాదం

ఏలూరు టౌన్ : ఏలూరు ప్రభుత్వ వైద్య కళాశాల ద్వితీయ సంవత్సర విద్యార్థి బస్సు ప్రమాదంలో గాయాల పాలయ్యాడు. డ్రైవర్ అప్రమత్తతో విద్యార్థి పెను ప్రమాదం నుంచి బయటపడ్డాడు. తోటి విద్యార్థులు తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా ప్రాంతానికి చెందిన ఎ.అశ్విన్ ఏలూరు ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. రోజూ వలే వైద్య విద్యా వసతి గృహం నుంచి శనివారం మధ్యాహ్నం కూడా విద్యార్థులంతా బస్సులో ఎక్కి కళాశాలకు బయలుదేరారు. ఈ క్రమంలో అశ్విన్ బస్సు ఎక్కుతూ అదుపుతప్పి చక్రం కింద పడ్డాడు. వెంటనే డ్రైవర్ బస్సును నిలుపుదల చేశాడు. అశ్విన్ కాలి మడానికి గాయం కావడంతో ఏలూరు వైద్య కళాశాల వైద్యులు శస్త్రచికిత్స చేశారు. అశ్విన్ ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు.

రుణాల దరఖాస్తు గడువు పొడిగించాలి



సమావేశంలో పాల్గొన్న దళిత సేన నాయకులు

ఏలూరు (టూటౌన్): ఎస్సీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాల దరఖాస్తు గడువును మరో 10 రోజులు పొడిగించాలని, అదనంగా కొత్త యూనిట్లను చేర్చాలని దళిత సేన డిమాండ్ చేసింది. స్థానిక దళిత సేన జిల్లా కార్యాలయంలో శనివారం ఏర్పాటుచేసిన ఏలూరు జిల్లా ముఖ్య నాయకుల సమావేశంలో దళిత సేన వ్యవస్థాపక అధ్యక్షుడు జిజ్జువరపు రవిప్రకాష్ మాట్లాడారు. ఎస్సీల ఆర్థిక అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలను విడుదల చేయడం సంతోషకరమని, కానీ ఎస్సీల్లో ఉన్న 59 ఉప కులాలకు ఉపయోగపడే విధంగా కులవృత్తులు ఆధారంగా యూనిట్లు రూపకల్పన లేదని అన్నారు. చెప్పుల వ్యాపార, తయారీ, నిర్వహణ, కిరాణా షాపులు, జనరల్ స్టోర్స్, దుస్తుల వ్యాపారం, టెంట్ హౌస్ తదితర యూనిట్లను పొందుపరచాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దళిత సేన ఏలూరు జిల్లా ఇన్‌చార్జి, జనరల్ సెక్రటరీ ఈథియా, దళిత సేన జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సికాకొల్లు స్టాలిన్, లింగపాలెం మండల బీసీ సెల్ అధ్యక్షులు కొప్పుల నాగేందర్, కార్యదర్శి లక్క పాము దాసు, మటంమ్ గూడెం గ్రామ అధ్యక్షులు మోహన్ రావు తదితర నాయకులు పాల్గొన్నారు.

శ్రీవారి క్షేత్రంలో పోటెత్తిన భక్తులు



అనివేటి మండపంలో భక్తుల రద్దీ

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రంలో శనివారం భక్తులు పోటెత్తారు. స్వామివారికి ప్రీతికరమైన రోజు, అందులోనూ వేసవి సెలవులు, బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని వేలాది మంది భక్తులు ఆలయానికి తరలివచ్చారు. తెల్లవారుజాము నుంచే భక్తుల రాక మొదలవడంతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి. తూర్పురాజగోపుర ప్రాంతం, అనివేటి మండపం, వైకుంఠం క్యూ కాంప్లెక్స్, దర్శనం క్యూలైన్లు, ప్రసాదం, టికెట్ కౌంటర్లు, కల్యాణ కట్ట ఇతర విభాగాలు భక్తులతో కిక్కిరిసాయి. ఆలయ అనివేటి మండపంలో వివాహాలు భారీగా జరిగాయి. అలాగే పలు భజన మండలి సభ్యులు ప్రదర్శించిన కోలాట నృత్యాలు చూపరులను అలరించాయి.

కుల వృత్తుల ఆధారిత యూనిట్లు లేవు



పల్లెం ప్రసాద్

దెందులూరు: ఎస్సీ కార్పొరేషన్ సబ్సిడీ రుణాల దరఖాస్తు గడువును మరో 10 రోజులు పొడిగించాలని ఏపీ ఫారెస్ట్ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ వైఎస్సార్ సీపీ సీనియర్ నేత పల్లెం ప్రసాద్ కోరారు. శనివారం మాదేపల్లిలో ఆయన మాట్లాడుతూ ఎస్సీలు 59 ఉపకులాలకు ఉపయోగపడే విధంగా కులవృత్తుల ఆధారంగా యూనిట్ల రూపకల్పన లేదన్నారు. సమస్యను పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కిరాణా షాపుల నిర్వహణ, జనరల్ స్టోర్స్, దుస్తుల వ్యాపారం, టెంట్ హౌస్ యూనిట్లు, పూర్తిస్థాయిలో దళితులు దళిత ఉపకులాలకు ఎస్సీ సబ్సిడీ రుణాలు మంజూరు క్షేత్రస్థాయిలో ప్రచారం లేదని ఆరోపించారు. ప్రసాద్ వెంట పార్టీ నేత గాలాయగూడెం, వార్డ్ మెంబర్ కొండపల్లి శ్రీధర్ ఉన్నారు.

బీసీల సమస్యలు పరిష్కరించాలి

ఏలూరు (టూటౌన్) : ఏలూరు నగర పాలక సంస్థ పరిధిలో ఉన్న బీసీ ఉద్యోగులు, బీసీల సమస్యల పరిష్కారానికి సహకరించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు కోరారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో శనివారం జాతీయ బీసీ సంక్షేమ సంఘం, బీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు కో ఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. వివిధ రకాల బీసీ సమస్యలపై చర్చించారు. కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఏలూరు జిల్లా అధ్యక్షుడు లక్కోజు రాజగోపాలాచారి, ఏపీ బీసీ ఓబీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పామర్తి ఏసురాజు, బీసీ నాయకులు ఉక్కుసూరిగా గోపాలకృష్ణ, కెల్లా దుర్గాప్రసాద్, జరజాపు ఉమా, బాయ్ వెంకటరావు, కొండల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	18	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	30	చిక్కుడు కాయలు	80
వంకాయలు (కాంతులు)	40	బీన్లచిక్కుడు	--
వంకాయలు (తెలుపు)	38	చామదుంపలు	54
బెండకాయలు	30	ములక్కాడలు	08, 10
పచ్చిమిర్చి	30	కంద	--
కాకర కాయలు	38	బీట్‌రూట్	36
బీరకాయలు	30	కీరా దోస	36
బీరకాయలు (పందిరి)	44	ఫ్రెంచ్‌బీన్స్	112
క్యాబేజీ	20	అల్లం	60
క్యారెట్	40	కొత్తిమీర (కట్ట)	25
దొండకాయలు	24	పాలకూర	12
బంగాళదుంపలు	30	తోటకూర	10
ఉల్లిపాయలు	22	చుక్కకూర	12
గోరుచిక్కుడు	38	గోంగూర	07-10
దోసకాయలు	22	పుదీనా	05
ఆనబకాయ (1)	10-15	క్యాప్సికమ్	70
పొట్లకాయ(1)	20	చిలకదదుంప	40

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	02
ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	07
ఏలూరు - జీడిమెట్ల (ఖమ్మం) (ఇంద్ర)	21.15	00
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	02
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	01

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	03
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.15	4822	03
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	00
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	10.45	4798	01
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	00
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	03
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (ఖమ్మం)	20.00	98516	32
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	22.10	98503	27
ఏలూరు - తిరుపతి	16.00	4830	30